ప్రగతి మార్గాలు

- గ్రామాల్లో రహదారులకు మోక్షం
- కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణాలు
- ఏళ్ల తరబడి సమస్యకు పరిష్కారం
- ఆనందంలో గిరిజనులు



టీడీపీ ప్రభుత్వ హయాంలో కనీసం బాగుపడని రోడ్లు జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొద్ది నెలల్లోనే కొత్త రూపురేఖలు దాల్చాయి. మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.50 కోట్ల పైబడి రోడ్ల నిర్మాణాలను చేపట్టారు. బంగారంపేట నుంచి కొత్తపల్లి వెళ్లే రహదారి అధ్వానంగా ఉండేది. టీడీపీ హయాంలో లెక్కలేనన్ని సార్లు రోడ్లు వేయాలని వినతులు ఇచ్చారు. ఆందోళనలు చేశారు.. అయినా పని జరగలేదు. బాలారం నుంచి ఆడాకుల వరకు ఐదు కిలోమీటర్ల రహదారి కూడా ద్విచక్ర వాహనాలు తిరిగేందుకు కూడా అవకాశం లేకుండా పోయింది. అదంతా గతం.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మన్యప్రాంతాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించారు. అధ్వాన దారులన్నింటిని సీసీ రోడ్లుగా మార్చారు. మారుమూల ప్రాంతాలకు సైతం రహదారుల నిర్మాణంతో రవాణా సదుపాయం మెరుగుపడింది. ఏళ్లనాటి రహదారుల సమస్య పరిష్కారమవడంతో గిరిజనులు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.


శరభన్నపాలెం-ఎర్రబంధ రహదారి

కొయ్యూరు: శరభన్నపాలెం నుంచి చింతపల్లి వెళ్లాలంటే దాదాపుగా 40 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది. అలాంటిది ఇప్పుడు శరభన్నపాలెం నుంచి ఎర్రబంద వరకు 11 కిలోమీటర్ల రోడ్డును వేయడంతో దూరం పూర్తిగా తగ్గిపోయింది. తక్కువ సమయంలో చింతపల్లి వెళ్తున్నారు. ఇక కొయ్యూరు నుంచి చింతపల్లి వెళ్లాలంటే గతంలో కృష్ణాదేవిపేట, రంపుల మీదుగా 70 కిలోమీటర్ల దూరం వెళ్లేవారు. ఇప్పుడు బూదరాళ్ల-చాపరాతిపాలెం రహదారి మూలంగా చాలా తక్కువ సమయంలోనే కొయ్యూరు నుంచి చింతపల్లి వెళ్తున్నారు. కొయ్యూరు నుంచి బందమామిళ్ల, కొయ్యూరు నుంచి మంప వెళ్లే రహదారులు కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్మించింది. చీకటి పంచాయతీగా పిలిచే బూదరాళ్లలోను మిషన్ కనెక్ట్ పాడేరులో భాగంగా అనేక గ్రామాలకు రోడ్లను వేశారు. దీని మూలంగా అత్యవసరం అయితే అంబులెన్స్‌లు వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. ఇలా అనేక రోడ్లను మండలంలో వేశారు. దీంతో గ్రామాల మధ్య రాకపోకలు పెరిగాయి.ద్విచక్ర వాహనాల సంఖ్య కూడా పెరిగింది. శివారు గ్రామాల్లోనూ రహదారులు అందుబాటులో రావడంతో బస్సు సర్వీసులతో పాటు ప్రైవేట్ వాహనాల సదపాయం అందుబాటులో వచ్చింది.దీంతో రైతులు తమ ఉత్పత్తులను వేర్వేరు ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయిస్తున్నారు. రహదారులు బాగుపడడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


బంగారంపేట-కొత్తపల్లి రహదారి

కల నెరవేరింది

బంగారంపేట-కొత్తపల్లి రహదారి నిర్మాణంలో టీడీపీ పాలకులు నిర్లక్ష్యం వహించారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మన్యంలో అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కొద్ది నెలల్లోనే లక్షలాది రూపాయలతో రహదారి నిర్మించింది. దీంతో గ్రామస్తుల ఏళ్ల నాటి కల నెరవేరింది. రవాణా సదుపాయం మెరుగుపడింది.

– శ్రీనివాసు, బంగారంపేట

దూరా భారం తగ్గింది



శరభన్నపాలెం నుంచి ఎర్రబంద వరకు రోడ్లు వేయడంతో దూరం బాగా తగ్గింది. రాకపోకలు పెరిగాయి. ఘతూ చింతపల్లి నుంచి ఇటువైపు వచ్చేవారు ఇటు నుంచి వెళ్లేవారు ఈ రహదారిని వాడుతున్నారు. జగనన్న ప్రభుత్వంలో శివారు గ్రామాల్లోనూ రహదారులు బాగుపడుతున్నాయి.

– సన్యాసిరావు, శరభన్నపాలెం



కొత్తపల్లి రహదారి వివరాలు

క్లుప్తంగా

రేపు సంక్రాంతి సంబరాలు

గంగవరం : స్థానిక సినిమాహాల్ వీధిలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్టు ఐఖ్యకోయ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు కె.వనితరాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నామని, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

గంగవరం : సంక్రాంతి పండగ సందర్భంగా అసాంఘిక కార్యక్రమాలకు యువత దూరంగా ఉండాలని, కుటుంబ సభ్యులతో రంపచోదవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొంపా కొండబాబు అన్నారు. ఆయన శనివారం ఓ ప్రకటనలో కోరారు. సంక్రాంతి పండుగను ఆహ్లాదకర వాతావరణంలో సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. మొల్లేరు గ్రామంలో కాటుమహేశ్వర స్వామి బంగారు పాపయమ్మా జాతరలో సంక్రాంతి సందర్భంగా ప్రజలు భక్తి భావంతో పూజలు నిర్వహిస్తారన్నారు.

పశుదాణాలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు


ఎల్. పొన్నవోలులో పశుదాణా విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: పశుదాణా విక్రయ కేంద్రాల్లో దాణాలో నాణ్యత లోపిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు హెచ్చరించారు. మండలంలో ఎల్. పొన్నవోలు, మాడుగుల గ్రోమోర్ పశుదాణా విక్రయ కేంద్రాల్లో శనివారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పశుదాణా బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించారు. పశుదాణాలో పోషకవిలువలు ఉన్నాయో లేదో తెలుసుకోవడానికి విశాఖ ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. పశుదాణాలో నాణ్యత లోపించి కల్తీ ఉందని తేలితే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విగ్రహాల ప్రతిష్ట


ఉత్సవ విగ్రహాలకు పూజలు

రాంబిల్లి : దిమిలిలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత వల్లభ నారాయణస్వామి ఉత్సవ విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇదే గ్రామానికి చెందిన ఎస్.గొల్లబాబు ఈ విగ్రహాలను అందజేశారు. ఆలయ అర్చకులు రామచంద్రాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. పలువురు భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

మద్యం సీసాలు స్వాధీనం: వ్యక్తి అరెస్టు

మునగపాక : అనుమతులు లేకుండా మద్యం సీసాలను ఇంటిలో ఉంచిన యువకుడిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ మహమ్మద్ అలీ షరీఫ్ తెలిపారు. సంతబయిలలో ఎస్‌ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేయగా, ఎటువంటి అనుమతులు లేకుండా నిల్వ ఉంచిన 51 మద్యం సీసాలను గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

లక్ష్మీనృసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు


ప్రత్యేకాలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

కశింకోట: కశింకోటలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ఆది, సోమవారాల్లో భోగి, సంక్రాంతి పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకుడు అత్తిలి కోదండపాణి తెలిపారు. ఈ అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ ప్రధాన వీధుల్లో రథంపై ఊరేగించనున్నట్లు తెలిపారు. అలాగే సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి(శివాలయం)లో ఈ నెల 15న సంక్రాంతి పురస్కరించుకొని స్వామి వారలను గ్రామంలో పల్లకిలో ఊరేగించనున్నట్లు ఆలయ అర్చకులు వి. చిదంబరం, వి. కృష్ణ తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన

అడ్డతీగల: ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలపై పరిరక్షణపై విద్యార్థులకు లయ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శనివారం అడ్డతీగలలో అవగాహన సదస్సు నిర్వహించారు.ఆదివాసీ సమాజం సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించడానికి భవిష్యత్ తరాలకు అందించే ప్రయత్నంలో భాగంగా లయ స్వచ్ఛంద సంస్థ వై.రామవరం,మారేడుమిల్లి మండలాలకు చెందిన 120 మంది ఆదివాసీ విద్యార్థులతో అవగాహన సదస్సు నిర్వహించినట్టు సంస్థ కో-ఆర్డినేటర్లు ఆకుల పద్మావతి, కింగుమహంతి కోటేశ్వరరావు, బుర్రె చక్రబాబు, భూముల చెల్లయ్య తెలిపారు.ఆదివాసీ యువత సాధికారత వారి సాంస్కృతిక వారసత్వానికి సంరక్షకులుగా మారడానికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడాన్ని నిర్ధారిస్తూ బాధ్యత, భావాన్ని కలిగించడం లక్ష్యంగా తర్ఫీదు ఇచ్చామన్నారు. ఆదివాసీ సమాజం శక్తివంతమైన వారసత్వాన్ని పరిరక్షించడంలో ఆదివాసీ విద్యార్థి, యువత ఆదర్శంగా నిలబడాలని భాష, కళ, సంగీతం, నృత్యం, జానపద సాహిత్యం, సంప్రదాయ పద్ధతులు పాటించాలన్నారు.ఆదివాసీ పెద్దలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

'వికసిత్ భారత్ సంకల్పయాత్ర' పోస్టర్ విడుదల

కె.కోటపాడు: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ కార్డుదారులకు ఉచితంగా బియ్యం అందిస్తున్నట్టు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. శనివారం ఎ.భీమవరం, ఎ.కోడూరు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల ద్వారా సాగు పెట్టుబడి కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగదు అందిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజల చెంతకే ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమం ద్వారా వైద్య సేవలందిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్‌లు తర్రా సన్యాసమ్మ, అక్కునాయుడు, ఎంపీటీసీ లెక్కల గౌతమి, వెలుగు ఏపీఎం వెంకటలక్ష్మి, కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో క్రీడా సంబరాలు

రాజవొమ్మంగి: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం సంక్రాంతిని పురస్కరించుకొని క్రీడా సంబరాలు అట్టహాసంగా జరిగాయి. వాలీబాల్, క్రికెట్ మ్యాచ్‌లు ఆడారు. ఆయా గ్రామాల్లోని గ్రామపెద్దల సహకారంతో విజేతలకు బహుమతులు ప్రకటించారు. పోటీల్లో విజేతలకు సంక్రాంతి రోజున బహుమతులు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా మండలంలోని దోనెలపాలెంతో సర్పంచ్ సవిరెల చంద్రుడు ఆధ్వర్యంలో వాలీబాల్, క్రికెట్ ఆటలు సందడిగా జరిగాయి. దోనెలపాలెం, చీడిపాలెం, బోనంగిపాలెం తదితర గ్రామాల నుంచి వచ్చిన ఐదు టీంలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. వాలీబాల్ పోటీలో దోనెలపాలెం జట్టుపై గొబ్బిలమడుగు టీమ్ విజయం సాధించింది. క్రికెట్‌లో దోనెలపాలెం బీ టీంపై దోనెలపాలెం ఎ-టీమ్ గెలుపొందింది. వీరి క్రీడా స్ఫూర్తిని స్థానికులు అభినందించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం దోనెలపాలెంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చంద్రుడు తెలిపారు.


వాలీబాల్ పోటీ విజేత గొబ్బిలమడుగు టీమ్‌తో సర్పంచ్ చంద్రుడు

భారీగా విక్రయాలు.. కొనుగోళ్లు


సంతలో దుస్తులు కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు


సంతలో మేకలను కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు

ముంచంగిపుట్టు: సంక్రాంతి పండుగతో శనివారం మండల కేంద్రంలో జరిగిన వారపు సంతకు జనాలు పోటెత్తారు. సంక్రాంతి పండుగ ముందు సంత కావడంతో దుస్తులు, పూజా సామగ్రి, ఇతరత్రా వస్తువుల కొనుగోలుకు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు వారపు సంతకు వచ్చారు. దీంతో ప్రతి దుకాణం కొనుగోలుదారులతో రద్దీగా కనిపించింది. రెడీమేడ్ దుస్తుల వ్యాపారం జోరుగా సాగింది. సంక్రాంతి పండగకు గిరిజనులు కొత్త కుండలు వినియోగించడం ఆనవాయితీ. దీంతో సంతలో కుండలకు గిరాకీ నెలకొంది. మేకలు, కోళ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. మేక సైజును బట్టి రూ.3వేల నుంచి రూ.20వేల వరకు అమ్ముడయ్యాయి. నాటుకోడి రూ.1000 నుంచి రూ.1700 వరకు ధర పలికింది. సంతలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక ఎస్‌ఐ రవీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు వాహనరాకపోకలను నియంత్రించారు.

పడాల్ సేవలు మరువలేనివి

కొయ్యూరు : నాలుగు సార్లు మంప సర్పంచ్‌గా చేసిన దివంగత ఇంగుద హరిమూర్తి పడాల్ స్థానికుల గిరిజనుల గుండెల్లో నిలిచిపోయారని వైఎస్సార్ సీపీ పాడేరు సమన్వయకర్త మత్స్యరాజ విశ్వేశ్వరరాజు అన్నారు. మంప పంచాయతీ తుమ్మలబంధలో హరిమూర్తి పడాల్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ బడుగు రమేష్, నాయకులతో పాల్గొన్న విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ పడాల్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ సందర్భంగా హరిమూర్తి పడాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజేంద్రపాలెంలో జరిగిన కార్యక్రమంలో పాడేరు సమన్వయకర్త మత్స్యరాజ విశ్వేశ్వరరాజును సన్మానించారు. ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచ్ ఇంగువ త్రినాథ్‌పడాల్, చింతపల్లి జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, అరకు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.సుధాకర్, కొయ్యూరు పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సుమర్ల సుధాకర్, మాజీ ఎంపీపీ వంతల బాబూరావు, జిల్లా కార్యదర్శి కంకిపాటి గిరిప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు అప్పారావు, కె.మల్లికార్జున్, మండల బూత్ కన్వీనర్ పాట్రిక పోతురాజు, మాజీ వైస్ ఎంపీపీ బి.కృష్ణారావు, సర్పంచ్‌లు సుర్ల చంద్రరావు, నత్తూరి సోమన్నదొర, మాదల చిన్నారావు, బూదరాళ్ల సచివాలయ కన్వీనర్ కొర్ర తిరుపతి, నర్సి కృష్ణ, టెలికామ్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు నర్సి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


హరిమూర్తి పడాల్ చిత్రపటం నివాళులర్పిస్తున్న పాడేరు సమన్వయకర్త విశ్వేశ్వరరాజు, ఎంపీపీ రమేష్ తదితరులు

పతంగుల సందడి


పాలిథిన్ పేపర్లతో తయారు చేసిన రంగుల గాలిపటాలు

కశింకోట : కశింకోటలో గాలి పటాలు(పతంగులు) అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రధానంగా యువకులు వీటి కొనుగోలు పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. సంక్రాంతి రోజుల్లో గాలి పటాలను పిల్లలు తమ ఇళ్ల వద్ద ఎగుర వేస్తుంటారు. రంగుల కాగితాలు, పాలిథిన్ పేపర్లతో అందంగా తయారు చేసిన దారం సహాయంతో గాలి పటాలను ఎగుర వేస్తుంటారు. గాలి ఒత్తిడిని తట్టుకునే పాలిథిన్ పేపర్లతో తయారు చేసిన గాలి పటాల పట్ల యువత, చిన్నారులు ఆసక్తి చూపుతుండడంతో వాటి విక్రయాల పట్ల వ్యాపారులు దృష్టి నిలిపారు. వీటిని పరిమాణం, తయారీకి వినియోగించిన పేపర్, డిజైన్‌లను అనుసరించి రూ.10 నుంచి రూ.500 వరకు వివిధ రూపాల్లో తయారు చేసి విక్రయాలు జరుపుతున్నారు. వీటిలో అందుబాటులో రూ.10 నుంచి రూ.30 వరకు ధర ఉన్న వాటిని యువకులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. సంక్రాంతి సందర్భంగా పోటీ పడి పతంగులు ఎగుర వేయడానికి యువత ఉత్సాహం చూపుతున్నారు.



కశింకోటలో విక్రయిస్తున్న గాలి పటాలు, గాలి పటాన్ని కొనుగోలు చేసిన చిన్నారి

గ్రామాల్లో సంక్రాంతి సందడి

రాజవొమ్మంగి: పెద్ద పండగ జరుపుకునేందుకు వేర్వేరు ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారితో పల్లె తల్లి మురిసిపోతోంది. గ్రామాల్లో సంక్రాంతి పండగ సందడి నెలకొంది. వీధులన్నీ అందమైన ముగ్గులతో కళకళలాడుతున్నాయి. మార్కెట్లన్నీ కిటకిటలాడుతున్నాయి. దుస్తుల దుకాణాలు కిక్కిరిశాయి. ప్రతి ఇంటాబంధువులు, స్నేహితులతో కిటకిటలాడుతున్నాయి. భోగి పండగకు యువకులు, చిన్నారులు కట్టెలు, కర్రలు సిద్ధం చేసుకున్నారు. తెల్లవారుజామున భోగి పంట వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. గ్రామాల్లో సంతలకు పండగ శోభ సంతరించుకుంది.


ముగ్గు వేస్తున్న యువతి

రేపు మునగపాకలో జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పోటీలు

మునగపాక : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మునగపాకలో ఈ నెల 15న జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గ్రామ రైతులు, గౌరీ యూత్, సంతబయిల యూత్ సంయుక్త నిర్వహణలో బైపాస్ రోడ్డు దరి 2 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఎంట్రీ ఫీజుగా రూ.200 చెల్లించాలన్నారు. మొదటి బహుమతిగా రూ.12వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు, తృతీయ బహుమతిగా రూ.8వేలు, చతుర్థ బహుమతిగా రూ.6వేలు, పంచమ బహుమతిగా రూ.3వేలు అందజేస్తామన్నారు. బహుమతికి నోచుకోని ప్రతి బండికి రూ.2500 వంతున ప్రైజ్‌మనీ అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9666682625 ను సంప్రదించాలని కోరారు.

పాల సొసైటీ సభ్యులకు బోనస్

మాడుగుల రూరల్: కె.జె.పురం పాల సొసైటీ సభ్యులకు బోనస్ పంపిణీ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో పాలు సరఫరా చేసిన 467 మంది సభ్యులకు 7 లక్షల 12 వేల 687 రూపాయలు సొసైటీ అధ్యక్షుడు యల్లపు వెంకట శ్రీనివాసరావు శనివారం అందజేశారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెలాఖరు వరకు పాలు సరఫరా చేసిన పాడి రైతులకు ఈ బోనస్ పంపిణీ చేశారు. సొసైటీ వేతన కార్యదర్శి బొడ్డేడ ప్రసాదు, సంఘ పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మల్లంపాలెంలో విఘ్నేశ్వరస్వామి తీర్థం

కె.కోటపాడు: మల్లంపాలెంలో భోగి పండగ పర్వదినాన్ని పురస్కరించుకుని స్వయంభూ విఘ్నేశ్వర స్వామి తీర్థ మహోత్సవాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు, షటిల్ టోర్నమెంట్, ముగ్గుల పోటీలు నిర్వహించనున్నారు. ఎడ్ల పందేల్లో రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన బళ్లకు బహుమతులు ప్రదానం చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.


స్వయంభూ విఘ్నేశ్వర స్వామి

నేడు ఉపమాకలో గోదా రంగనాథుల కల్యాణం

నక్కపల్లి : ధనుర్మాసం పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రం ఉపమాక వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం గోదా రంగనాథుల కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాట్లు చేశారు. గోదాదేవి శ్రీరంగనాథున్ని వివాహ మాడడం కోసం నెల రోజుల పాటు ధనుర్మాస వ్రతం ఆచరించింది. భోగి పండగతో ఈ వ్రతం పూర్తి కావడంతో శ్రీరంగనాథుడు గోదాదేవిని వివాహమాడడానికి అంగీకరించడంతో గోదా కల్యాణం భోగి పండగ నాడు నిర్వహిస్తారు. ఉపమాకలో స్వామివారి పుష్పతోటలో గోదారంగనాథుల కల్యాణం భోగినాడు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు.

ఈ సందర్భంగా గోదాదేవి అమ్మవారిని నూతన వస్త్రాలంకరణలో అలంకరించారు. ఆదివారం ఉదయం కొండపై గల మూలవిరాట్ సన్నిధిలో నిత్యార్చనలు, అభిషేకాలు నిర్వహిస్తారు. కొండ దిగువన ఆండాళ్లమ్మ (గోదాదేవి) సన్నిధిలో నిత్య కార్యక్రమాలు అనంతరం గోదాదేవి అమ్మవారిని స్వామి వార్లను పల్లకిలో స్వామివారి పుష్పతోటలోకి తీసుకెళ్తారు. అక్కడ అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహిస్తామని ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు. కల్యాణం అనంతరం స్వామి అమ్మవార్లకు రాజాధిరాజ వాహనంలో తిరువీధి సేవలు నిర్వహిస్తామన్నారు.